క్లుప్తంగా

ఘనంగా డ్రక్కర్ జయంతి



పెనమలూరు: ఆధునిక మేనేజ్‌మెంట్ పితామహుడు ప్రొఫెసర్ పీటర్ ఎఫ్ డ్రక్కర్ జయంతి కానూరులో శుక్రవారం నిర్వహించారు. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పీబీ సిద్ధార్థ అకడమిక్ డీన్ డాక్టర్ జంపాల రాజేష్ మాట్లాడుతూ పీటర్ ఎఫ్ డ్రక్కర్ రాసిన ఏజ్ ఆఫ్ డీస్ కంటిన్యూటీ, ఎకనామిక్ చైన్ కాస్టింగ్ ఆఫ్ ది ఆకార్పొరేషన్ పుస్తకాల గురించి వివరించారు. నాయకత్వ లక్షణాలు, నైపుణ్యత, సమాజంలో యువకుల పాత్ర తదితర అంశాలపై రాజేష్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, విభాగాధిపతి డాక్టర్ పి.ఆదిలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. బందర్ రోడ్డు, పెనమలూరు సెంటర్, సాలిపేట, ప్రకాశనగర్, రామాపురం కాలనీ, ఏపీఎం గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ సిబ్బందితో గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ఓటర్ల జాబితా క్లెయిమ్స్ పెండింగ్ ఉంచొద్దు

విజయవాడరూరల్: మండలంలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులదేనని రూరల్ మండల తహసీల్దారు కె.లక్ష్మి అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో బూత్ స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలో ఓటర్ల జాబితా ప్రకటించాల్సిన నేపథ్యంలో మండలంలోని గన్నవరం, మైలవరం నియోజకవర్గాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారుల పరిధిలో ప్రజల నుంచి వచ్చిన క్లైమ్స్ ఇప్పటి వరకు అయిదువేల వరకు ఉన్నాయన్నారు. వాటిని వెంటనే క్లీయర్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు ఎండీ సలీమ్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

27 నుంచి కులగణన

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీ నుంచి గ్రామాల్లో కులగణన జరుగుతుందని ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. మండలంలోని 32 సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి కులగణకు సంబంధించిన వివరాలు సేకరిస్తారన్నారు. ఆయా కుటుంబాల్లోని వారి నుంచి బయోమెట్రిక్ తీసుకుని ఆ వివరాలను ఆన్‌లైన్ చేస్తారన్నారు. కులగణన ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉండగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది ఒక ప్రణాళి కాబద్ధంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

కానుకల హుండీ ఆదాయం రూ.4.84 లక్షలు



రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయం రూ.4,84,953 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను శుక్రవారం దేవదాయశాఖాధికారి వి.అనురాధ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ భక్తులు హుండీల ద్వారా 56 రోజులకు గానూ సమర్పించిన కానుకలు లెక్కించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు మత్తె కిరణ్ కుమార్, సిబ్బంది, సేవా దళ్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్
- రూ.35.84 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



పామర్తినగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. మండలంలోని గన్నవరం, బుద్ధవరం గ్రామ పంచాయతీల పరిధిలో శుక్రవారం జరిగిన రూ.35.84 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత గాడపేటలో రూ.8 లక్షలతో సీసీ రోడ్లకు, చర్చిరోడ్డులో రూ.22 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీమల్లికార్జున స్కూల్ నుంచి రాజీవ్‌నగర్ వరకు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను, పామర్తినగర్‌లో రూ.14 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. సుమారు రూ.35 కోట్లతో చేపట్టనున్న గన్నవరం–పుట్టగుంట ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులకు దావాజిగూడెం వద్ద ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే నాడు–నేడు ద్వారా పలు ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను ఆధునికీకరించినట్లు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రహదారుల నిర్మాణానికి మండల పరిషత్ ద్వారా పెద్ద ఎత్తున్న నిధులు మంజూరు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఎంపీపీ అనగాని రవి, వైఎస్ ఎంపీపీ కాలడ్డ శివనాగరాజకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిమట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, పార్టీ నాయకులు పడమట నాగరాజు, కై లే శివకుమార్, పడమట సురేష్, లుక్కా ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



గుమ్మడిలో నాగేంద్రక్షేత్రంలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

విజయవాడరూరల్: నాగులచవితి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పుట్టల్లో పాలుపోసి పూజలు నిర్వహించారు. నున్న గ్రామంలో ప్రసిద్ధ నరసింహస్వామి గుడి వద్ద నాగదేవతపుట్టలో భక్తులు తెల్లవారుజామునుంచి పాలుపోసి పూజలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ దంపతులు బొంతు సరోజిని, సాంబిరెడ్డి పుట్టలో పాలుపోసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చినకంచిలోలో నాగేంద్రస్వామి గుడివద్ద భక్తులు అధికసంఖ్యలో పూజలు నిర్వహించారు. వీలేజి కండ్రికలో పుట్టలో పాలుపోసి భక్తులు పూజలు చేశారు. పి.నైనవరం గ్రామంలో ప్రసిద్ధ నాగేంద్రస్వామి గుడి వద్ద ఉదయం నుంచి భక్తులు పుట్టలో పాలుపోసి, నాగేంద్రస్వామికి పూజలు చేశారు. అంబాపురం గ్రామంలో నాగేంద్రస్వామి గుడి వద్ద పూజలు చేసి పుట్టలో పాలుపోశారు.

గన్నవరం రూరల్: నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో శుక్రవారం ఆచరించారు. ఉదయం వేళ దేవాలయాలకు వెళ్లి ఇష్ట దైవాలను దర్శించి, పుట్టలో పాలు పోశారు. నాగేంద్రుడి కరుణా కటాక్షాలు చూపాలని వేడుకున్నారు. చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో భక్తులు పుట్టలో పాలు పోశారు. ముస్తాబాద, సూరంపల్లి, తెంపల్లి, గొల్లనపల్లి గ్రామాల్లో పుట్టలలో భక్తులు పాలు పోశారు.

గన్నవరం: నాగులచవితి పర్వదిన వేడుకలను గన్నవరం ప్రాంతంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేసరపల్లి శివారు గుమ్మడి నాగేంద్రక్షేత్రంలోని శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో భక్తులు పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. నాగుల చవితి సందర్భంగా శ్రీసోమలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కేసరపల్లిలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, దావాజిగూడెంలోని శివాలయంలో నాగుల చవితి పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



ఉయ్యూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.ఇమ్మానుయేలు అన్నారు. మండలంలోని ఉయ్యూరు, ఆకునూరు, పెద ఓగిరాల, గండిగుంట, కడవకొల్లు, కాటూరు, కలవపాముల గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగంలో మార్పులు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మండవ వెంకట శ్రీనివాస్, ప్రతినిధులు మిశ్రా, శ్రీనివాసమూర్తి, సుగుణాకర్‌రావు, షేక్ షిలార్, మీర్జా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- గొడవర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: సంక్షేమ పాలనను ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న తమకు ఇళ్లస్థలాలను ఇవ్వాలని, అంతర్గత రహదారులు అభివృద్ధి చేయాలని పలువురు విజ్ఞప్తిచేశారు. విద్యుత్ అవాంతరాలను పరిష్కరించటంలో జాప్యం జరుగుతుందని, ఎనర్జీ అసిస్టెంట్‌ను నియమించాలని విన్నవించారు. సచివాలయానికి వెళ్తే సిబ్బంది పట్టించుకోవటం లేదని పలువురు ఫిర్యాదుచేశారు. ఎమ్మెల్యే పార్థసారథి స్పందిస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లస్థలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామని, సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సమర్థంగా ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, ఎంపీటీసీ చుండూరు నిర్మలజ్యోతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ చోరగుడి అనిత, నాయకులు కాగిత రాజా రమేష్, చెన్ను బాబూజీ, ఇంటూరి రామయ్య, చుండూరు మోహన్‌రావు, కలపాల సురేష్, ఉప్పులేటి శ్రీనివాసరావు, ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ కొప్పుల భాస్కర్‌రావు, పంచాయతీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సమన్వయంతో పని చేయాలి

ఆర్డీఓ రాజు



పెనమలూరు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు



పునాదిపాడులో ధాన్యం కొనుగోళ్ల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనమలూరు: ధాన్యం సేకరణలో అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి రైతులకు అండగా ఉండాలని ఆర్డీఓ జి.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండల పరిధిలో నవంబర్ 25వ తేదీ నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా గ్రామల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తేమ శాతం పరీక్షించే యంత్రాలు, కాటాలు, గోనె సంచులు, టార్పాట్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తరలించటానికి వాహనాల కొరత ఉండరాదని తెలిపారు. మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఎ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2203 , బి.గ్రేడ్ ధాన్యం రూ.2183 ధర నిర్ధారించాలరని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, విలేజ్ ఎగ్రికల్చర్ అసిస్టెంట్స్, వీఆర్వోలు, టెక్నికల్ అసిస్టెంట్స్ , పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పలువురు పాల్గొన్నారు.

కంకిపాడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండల చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు కోరారు. పునాదిపాడు ఆర్‌బీకే వద్ద ధాన్యం కొనుగోళ్లు ప్రక్రియపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయ్‌బాబు, రామచంద్రరావు మాట్లాడుతూ మద్దతు ధర కోసం రైతుభరోసా కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. గోనె సంచులను ఆర్‌బీకేలోని గోదాముల్లో సిద్ధం చేశారన్నారు. ఏఓ పీఎం కిరణ్, మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ డొక్కు సత్యనారాయణ, వీఆర్‌ఓ ఆర్ఎస్‌కే మల్లికార్జునరావు, కె.వరప్రసాద్, వీఏఏ కె.పావని పాల్గొన్నారు. కోలవెన్ను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహనా సదస్సులో సర్పంచ్ చోరగుడి సురేష్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, ఎంపీటీసీ తోకల ఉమాదేవి, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శేషగిరి, కోఆప్షన్ సభ్యురాలు నిషాద్‌బేగం, వీఆర్‌ఓ సందీప్, వీఏఏ పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సమష్టి పోరాటం

కంకిపాడు: దళితుల హక్కుల సాధన కోసం సమష్టి పోరాటం సాగిస్తామని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, గోసాల సెంటరు ప్రాంతాల్లో చైతన్య యాత్ర శుక్రవారం నిర్వహించారు. ఏలియా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సముచిత న్యాయం జరిగే వరకూ పోరాటం సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంభా వెంకటేశ్వరరావు, గరికె దుర్గాప్రసాద్, సాలా నాగులు, ఉయ్యాల ఏడుకొండలు, కాజా వసంతకుమార్, కూచిపూడి ప్రకాశరావు, ఇంటూరి వేణు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ పండుగ



పెనమలూరు: గోసాల ఇస్లాంపేటలో శుక్రవారం రాత్రి గ్యార్మీ షరీఫ్ పండుగ ఘనంగా చేశారు. భక్తులు జెండాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జెండాలను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో గోసాల సర్పంచి, పెనమలూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, గ్రామ పార్టీ కన్వీనర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ పోలవరపు రవి, వార్డు సభ్యుడు ఆసిఫ్‌పాషా, స్థానికులు హాజీఆలీ, రహీం, ఆలీం, పీర్‌అహ్మద్ పలువురు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు అనుమతి

గన్నవరం రూరల్ : మండలంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో కొత్తగా ఆరు బీఎస్సీ పారామెడికల్ కౌన్సిల్ కోర్సులు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చినట్లు కళాశాల యాజమాన్యం శుక్రవారం తెలియజేసింది. బీఎస్సీ కార్డియాక్ కేర్ టెక్నాలజీ, కార్డియో వాస్కులర్ టెక్నాలజీ, ఎనస్థీషియాలజీ, ఇమేజింగ్, రేనాల్ డిసీజెస్, రెస్పిరేటరీ థెరపీ, ఆప్టమాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చదివిన వారు అర్హులన్నారు. ఒక్కొక్క కోర్సుకు 20 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పురుషోత్తపట్నంలో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పెనమలూరులో ఆటల పోటీల అనంతరం నిర్వాహకులతో విద్యార్థులు



గన్నవరం సదస్సులో మాట్లాడుతున్న శాయోజిరావు



తెన్నేరులో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న చిన్నారులు



ఉయ్యూరు గ్రంథాలయంలో మాట్లాడుతున్న డీవైఈఓ పద్మారాణి



ఉంగుటూరులో తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయుడు

గన్నవరం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తెలుగు ఉపాధ్యాయుడు డి.గణపతి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పురుషోత్తపట్నం గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అభ్యుదయ వాదులుగా ఎదగాలని ఆకాంక్షించారు. లైబ్రేరియన్ కె.కృపానందం ఆధ్వర్యంలో పలు పాఠశాలలకు చెందిన జూనియర్, సీనియర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో సబ్‌జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మ్యూజికల్ చైర్ పోటీలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

పెనమలూరు: పెనమలూరులో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. గ్రంథాలయం వద్ద శుక్రవారం ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులకు పరుగుపందెం, లెమన్ అండ్ స్పూన్, పలు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి పి.హరీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వణుకూరు శాఖ గ్రంథాలమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. శాఖ గ్రంథాలయ అధికారిణి ఎస్.భారతి, హెచ్ఎం రఘురామ్, టీచర్స్ కె.విజయలక్ష్మి, సతీష్, మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేథోశక్తి పెంపు

ఉయ్యూరు: పుస్తక పఠనంతో మేథోశక్తి పెంపొందుతుందని గుడివాడ డీవైఈఓ ఐ.పద్మారాణి అన్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పద్మారాణి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల హెచ్ఎం విద్యావతి, సిద్ధార్థ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, గ్రంథాలయాధికారి రమణి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనాలు, సెమినార్స్, రచయితల సందేశాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత అధ్యాపకుడు శాయోజిరావు గ్రంథాలయాల ప్రాధాన్యత, ఆవశ్యకతను వివరించారు. గ్రంథాలయంలోని విలువైన పుస్తక సంపదను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మేథోశక్తిని పెంచుకోవాలని కోరారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు, విశ్రాంత అధ్యాపకులు గన్నే వెంకట్రావు, ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి డి.బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యూజికల్ చైర్స్ నిర్వహణ

కంకిపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీ పాఠశాల హెచ్ఎం శివకుమారి, గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సెమినార్ ఏర్పాటు చేశారు. క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ ప్రతినిధులు టీ.శేషుబాబు, కె.రాంబాబు, కుసుమ కుమార్, గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

ఉంగుటూరు: ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సందర్శించడం అలవాటు చేసుకోవడం వలన తమకు తెలియని విషయాలు తెలుసుకుంటారని జెడ్పీ హైస్కూల్‌తెలుగుపండిట్‌జి.యేసుబాబు అన్నారు. మండలంలోని మానికొండ, తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరులో గ్రంథాలయాల్లో వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు బాషా సంస్కృతి గురించి, తెలుగు కవుల ప్రాముఖ్యతను వివరించారు. చదువుతో పాటు ఆటలకు కూడా ఆడాలన్నారు. గ్రంథాలయ అధికారి యూ.చంద్రశేఖర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై ప్రచారం



పీఏసీఎస్ వద్ద మాట్లాడుతున్న చైర్‌పర్సన్

గన్నవరం రూరల్: ముస్తాబాదలో డీసీసీబీ ఆధ్వర్యంలో స్థానిక పీఏసీఎస్ వద్ద డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వాలు అందిస్తున్న సేవలను ప్రదర్శించారు. చైర్ పర్సన్ మేడసాని శ్రీనివాస్ చౌదరి, మేనేజర్ జయ సుకుమా, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో సహకార రంగం పాత్ర గణనీయం

గన్నవరం రూరల్: దేశ అభివృద్ధిలో సహకార రంగం పాత్ర ఘనమైనదని గన్నవరం ఉప సహకార విభాగ అధికారి జాస్తి నాగభూషణం అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సూరంపల్లి పీఏసీఎస్ వద్ద చైర్‌పర్సన్ తుల్లిమిల్లి ఏడుకొండలు ఆధ్వర్యంలో సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధనలో, రైతాంగాన్ని బలోపేతం చేయడంలో సహకార రంగం కృషి మరువలేనిదని చెప్పారు. ప్రధాన వక్తగా హాజరైన కె.భోజ రంగరాజు మాట్లాడుతూ భారత దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సుస్థిర సాధనలో సహకార సంఘాలు ఎనలేని పాత్ర వహించాయన్నారు. సహకార పతాకాన్ని చైర్ పర్సన్ ఏడుకొండలు ఆవిష్కరించారు. సీఈవో జొన్నలగడ్డ సరిత, పర్సన్‌లు సరిహద్దు బోపయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈవో-2కు తప్పిన ప్రమాదం

ఉంగుటూరు: ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారి-2 జె.సాంబశివరావుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎంఈవో శుక్రవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు కారులో గన్నవరం వైపు బయలుదేరాడు. వెన్నూతల గ్రామంలో ఓ మలుపు వద్ద కారు అదుపుతప్పి పంటకాలువలోకి వెళ్లింది. ఈ ఘటనలో సాంబశివరావుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో కారును పంటకాలువలో నుంచి బయటకు తీశారు.